క్లుప్తంగా

'ఉపాధి'లో నల్లజర్ల ప్రథమం



చెరువు పూడికతీత పనుల్లో ఉపాధి కూలీలు

నల్లజర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లాలోని 7 మెట్ట ప్రాంత మండలాల్లో నల్లజర్ల ప్రథమ స్థానంలో ఉందని ఏపీఓ సత్యనారాయణ తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో వలసలు అరికట్టి, అత్యధిక మందికి 100 రోజుల పని దినాలు కల్పించడంలో ఈ స్థానం సాధించామని చెప్పారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 3.49 లక్షలు, 2022–23లో 4.10 లక్షల పనిదినాలు కల్పించగా, ఈ నెలాఖరుకు మరో 30 వేల పనిదినాలు పూర్తి చేయనున్నామని, ఇది అంతకు ముందు నాలుగేళ్ల కంటే మెరుగ్గా ఉందని వివరించారు. 1,102 మందికి 100 రోజుల పని కల్పించగా సరాసరి వేతనం రూ.221 లభించిందన్నారు. వేతనాలుగా రూ.7.79 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ.4.62 కోట్లు కలిపి మొత్తం రూ.12.79 కోట్లతో పనులు చేశామని తెలిపారు. ఉద్యాన సాగులో మొక్కల అభివృద్ధి, పంటబోదెలు, చెరువుల్లో పూడికతీత, పుంతరోడ్ల అభివృద్ధి వంటి పనులు చేపట్టామని చెప్పారు. లక్ష్యానికి మించి, 126 శాతం పనులు చేశామని చెప్పారు. కూలీలకు ఏప్రిల్ 1 నుంచి రూ.15 అదనంగా అందించనున్నారని, గతంలో రూ.257 వేతనం ఇస్తుండగా, అదనంగా ఇచ్చే రూ.15తో కలిపి రూ.272 చెల్లించనున్నారని ఏపీఓ సత్యనారాయణ వివరించారు.

50 బస్తాల చొప్పన కొనుగోలు చేయాలంటూ ధర్నా

కొవ్వూరు: ఎకరానికి కనీసం 50 బస్తాల వంతున రబీ ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు బుధవారం స్థానిక డివిజనల్ వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎకరాకు 42 బస్తాల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ రబీలో ఎకరానికి 50 నుంచి 55 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి వచ్చిందని వారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడం ఏమిటని ఏడీఈ చంద్రశేఖర్‌ను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఏడీఈ చంద్రశేఖర్ వారికి బదులిచ్చారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, ఏఎంసీ మాజీ చైర్మన్లు వేగి చిన్నా, బూరుగుపల్లి వీర్రాఘవులు, ఆ పార్టీ నాయకులు పాట్రు శ్రీనివాస్, బేతిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌కు తుది వీడ్కోలు



సయ్యద్ మస్తాన్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ మస్తాన్ భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దూబచర్లలోని ఆయన ఇంటి వద్ద బుధవారం కడసారి దర్శించి నివాళులర్పించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మస్తాన్ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుమారుడు మునాఫ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, తొమ్మండ్రు రమేష్, ముప్పిడి సంపత్‌కుమార్, చీమకుర్తి రాజసింహ, పంది సత్యనారాయణ, ముండ్రు ప్రసాద్, తోట వెంకట్రావు, పంచాయతీ సర్పంచ్ బాలయ్య, ఉప సర్పంచ్ బాటయ్య తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం చేస్తున్న పార్డ్ ఇండియా సంస్థ ప్రతినిధులు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం అగ్ని ప్రమాద బాధితులకు వివిధ స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సాయం అందించాయి. యర్నగూడెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో చిరు వ్యాపారులకు చెందిన రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో షేక్ అమీనా, కడిమి దావీదులకు చెందిన దుకాణాలు కాలిపోయాయి. సుమారు రూ. రెండు లక్షల ఆస్తినష్టం జరిగింది. బాధిత కుటుంబాలను మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బుధవారం పరామర్శించి తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. మానవత సంస్థ రూ.2 వేలు, పార్డ్ ఇండియా సంస్థ రూ.4 వేలు, రెండు బస్తాల బియ్యం బాధిత కుటుంబాలకు అందజేశారు.

దివ్యాంగుల 'భవిత' బంగారం

- ఫిజియోథెరపీతో మెరుగైన ఫలితాలు
- ప్రతి సోమవారం శిబిరం
- మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- నియోజకవర్గంలో 936 మంది దివ్యాంగ విద్యార్థులు



భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల ఆటలు



దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు జగదీష్



దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో ఉత్సాహంగా..(ఫైల్)

నిడదవోలు రూరల్: అమ్మా అనాల్సిన చిన్నారుల పెదాలు మూగవైనా.. పిడుగులు పడ్డా వినపడని చెవిటితనం ఉన్నా తల్లిదండ్రులు కుంగిపోవడం లేదు. ఆ చిన్నారులు.. మంచుతెరల వెనుక ఉన్న మందారాలు.. విధి వెక్కిరించిన ప్రతిభావంతులు. జన్మతః వైకల్యం బారిన పడినా మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తున్నారు. సహిత విద్యను అవగతం చేసుకుని శిక్షణలో నైపుణ్యాన్ని ఒడిసి పట్టుకుంటున్నారు. భవిత కేంద్రాలే వేదికగా.. ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంటున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వారి భవితకు చేయూత ఇస్తూ ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరంగా మారుతున్నాయి. ఈ కేంద్రాల్లో బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టి లోపం, ఎదుగుదల లేని చిన్నారుల్లో ఆసక్తి కలిగించి వారితో ఆరుబయట చిన్న చిన్న ఆటలాడిస్తున్నారు. వారిలో చైతన్యం నింపేందుకు నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీరికి మధ్యాహ్న భోజనాన్ని కూడా ఏర్పాటుచేసి సాయంత్రం వరకూ నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రానికి తప్పక తీసుకెళ్లాలన్న నమ్మకాన్ని తల్లిదండ్రులకు కల్పించి, తమ పిల్లల మానసిక ఎదుగుదలను గమనించేలా చేస్తున్నారు.

కేంద్రాల్లో ప్రత్యేక కృషి..

దివ్యాంగులను కూడా మిగతావారిలా ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారు. పూర్వ పాఠశాల విద్య స్థాయి నుంచి పదో తరగతి వరకూ వీరికి ప్రత్యేక శిక్షణతో చదువు నేర్పుతున్నారు. నియోజకవర్గంలోని నిడదవోలు మండలం సమిశ్రగూడెం, పెరవలి మండలం కానూరు, ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 936 మంది దివ్యాంగులైన విద్యార్థులుండగా వారిలో 97 మంది భవిత కేంద్రాల్లో సహిత విద్య అభ్యసిస్తున్నారు. వీరికి ప్రత్యేక విద్యా బోధన ద్వారానే సాధ్యమయ్యే పనికావడంతో ఆ పాఠ్యాంశాలు నేర్పుతూ వారి భవితను తీర్చిదిద్దుతున్నారు. ప్రత్యేక యంత్రాలతో వినికిడి సామర్థ్యం పెంచుతూ మాట్లాడటంలో ప్రత్యేక శిక్షణ ఏర్పాట్లు వాటిలో ఉన్నాయి. బ్రెయిలీ లిపిలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, సహిత విద్యలో ఉపాధ్యాయ శిక్షణతో పాటు, వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతి సోమవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయడంతో పాటు భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు రవాణా ఖర్చులకు నెలకు రూ.300 చొప్పున చెల్లిస్తున్నారు. వీరికి సహాయంగా వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్సు కింద నెలకు ఒకొక్కరికి రూ.300, గైడ్ స్టైఫండ్ కింద 1 నుంచి 10వ తరగతి చదివే ఆడ పిల్లలకు నెలకు ఒకొక్కరికి రూ.300, అంధులైన పిల్లలతో పాటు వచ్చేవారికి రీడర్ అలవెన్స్ రూ.300 చొప్పున అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన ‘మిషన్ వాత్సల్య పథకం’ నమోదుకు దివ్యాంగులకు ప్రత్యేక అవకాశం కల్పించారు. భవిత కేంద్రాలకు దాతలు కూడా ఆటపాటల కోసం క్రీడాసామగ్రిని అందిస్తున్నారు.

అన్ని కోణాల్లో శిక్షణ

స్పీచ్ థెరపీ: దివ్యాంగుల్లో మిగిలి ఉన్న వినికిడి శక్తిని వినియోగించుకునేలా వారికి వినికిడి యంత్రం, మాటలను పలికేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

వినికిడి శక్తి: మన పరిసరాల్లో నిత్యం వినిపించే శబ్దాలను వారికి పరిచయం చేస్తూ వాటిని గ్రహించేలా చేస్తారు.

పెదాల కదలిక: మనం చెప్పే పదాలను వారు గ్రహించేలా పెదాల కదలిక ద్వారా విషయం అర్థమయ్యేలా శిక్షణ ఉంటుంది.

సైగల భాష : అర్థం కాని పదాలను సైగల ద్వారా అర్థం అయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ప్రత్యేక ఆటలు: వినికిడిని పెంపొందించి సులభంగా వారిని ఆటల్లో పాల్గొనేలా ప్రత్యేకంగా రూపకల్పన చేసిన ఆటల్లో శిక్షణ ఇచ్చి ఆడిస్తారు.

> **మానసిక ఎదుగుదల కనిపిస్తోంది**
>
> 
>
> భవిత కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న దివ్యాంగుల్లో మానసిక ఎదుగుదల కనిపిస్తోంది. పదాలను గుర్తుపెట్టుకోవడంతో పాటు ఆటపాటల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రతి సోమవారం ఫిజియోథెరపీతో పాటు రెండు నెలలకోసారి సైకాలజిస్టుతో చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> – ఆర్.లక్ష్మణరావు, సహిత విద్య ఉపాధ్యాయుడు, భవిత కేంద్రం, సమిశ్రగూడెం

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడిని సన్మానించిన ముస్లిం నాయకులు

నిడదవోలు రూరల్: ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటించడం గొప్ప వరమని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని పెద్ద మసీదులో ముస్లింలకు ఎమ్మెల్యే బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం ముస్లింలకు ఈద్, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, బిర్రే పార్వతి, పార్టీ నాయకులు గుర్రం జేమ్స్, అలమూరి రాజా, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట 15 మంది బైండోవర్

తాళ్లపూడి: మండలంలోని సారా తయారీదారులు, రవాణాదారులు, విక్రేతలైన 15 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఈబీ కొవ్వూరు సీఐ వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. వారిని తాళ్లపూడి తహసీల్దార్ టి.రాధిక ఎదుట బైండోవర్ చేశామన్నారు. సారా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీతాలు చెల్లించాలని వైద్య ఉద్యోగుల వినతి

కొవ్వూరు: తమ మార్చి నెల జీతాలు చెల్లించాలని ఏపీ వైద్య విధాన పరిషత్ కింద జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు కొవ్వూరులో డీసీహెచ్ ఎస్ ఎం.సనత్‌కుమారికి వినతిపత్రం అందజేశారు. ఎన్‌జీవో రాజమహేంద్రవరం నగరశాఖ అధ్యక్షుడు వైవీఎస్ నాయుడు, ఏపీవీవీపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణంరాజు, కె.రమాకాంత్‌రెడ్డి, దిలీప్, విజయ, సురేష్ మాధవి, భువనేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై సాగు యంత్రాలు

తాళ్లపూడి: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వివిధ రకాల యంత్రాలను సబ్సిడీపై రైతు గ్రూపులకు సరఫరా చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి జి.రుచిత అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా వేగేశ్వరపురంలో రైతు గ్రూపులకు బుధవారం పవర్ టిల్లర్లు, బేలర్ (ఎండు గడ్డిని చుట్టే యంత్రం) 40 శాతం సబ్సిడీపై అందించారు. ఏవో రుచిత మాట్లాడుతూ ఈ గ్రామంలోని రెండు గ్రూపులకు గాను రెండు పవర్ టిలర్లు అందజేశామన్నారు. వాటి మొత్తం ఖరీదలో రైతు గ్రూపు వాటా రూ.60 వేలు, సబ్సిడీ రూ.1.40 వేలు, బ్యాంక్ రుణం రూ.2 లక్షలని ఏవో వివరించారు. అలాగే గడ్డిచుట్టే యంత్రం ఖరీదు 3.26 లక్షలైతే, ప్రభుత్వ సబ్సిడీ రూ.1.30 లక్షలు, బ్యాంక్ రుణం రూ.1.63 లక్షలని, మిగతా మొత్తాన్ని రైతు గ్రూపు చెల్లించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, పంచాయతీ కార్యదర్శి డీఎస్ శ్రీనివాస్, అగ్రికల్చర్ అసిస్టెంట్ గౌతమి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు జవాబుదారులం

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 19వ వార్డులో గడప గడపకూ..



ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు జవాబుదారీతనం వహిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని 19వ వార్డులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి బాగోగుల గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. గత నాలుగేళ్లుగా పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఎంతమేర మేలు చేకూరిందో లెక్కలతో సహా మంత్రి వనిత వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్ష , గౌరవాధ్యక్షులు రుత్తల భాస్కర రావు, నగ్గపాటి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు సలాది సందీప్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, వరిగేటి సుధాకర్, గాడి విజయ్‌రాజ్‌కుమార్, తోట రామకృష్ణ, నామా ప్రకాశం, రుద్రం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



కొవ్వూరు సీహెచ్‌సీలో ఫైర్ పరికరాల వినియోగం ఎలాగో చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



నిడదవోలులో గ్యాస్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొవ్వూరు: ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి స్థానిక అగ్నిమాపక అధికారి కె.రాముడు బుధవారం అవగాహన కల్పించారు. ఆసుపత్రిలోని అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో ఆసుపత్రి సిబ్బందికి ప్రయోగాత్మకంగా అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. అగ్ని మాపక వారోత్సవాల ఆరో రోజైన బుధవారం జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధి–అగ్ని భద్రతపై అనే అంశంపై ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది,పేషెంట్లకు మాక్ డ్రిల్ ద్వారా మంటలను అదుపు చేసే విధానాన్ని తెలియజేశారు.ఫైర్ పరికరాలను ఎలా వినియోగించాలో చేసి చూపించారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రా షుగర్స్‌లో..

కొవ్వూరు: జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆంధ్రా షుగర్స్ కార్మికులు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆ కర్మాగారం భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కర్మాగారంలో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక పరికరాలను వినియోగించి ఏ విధంగా మంటలను అదుపు చేయాలో మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. సాధారణంగా కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలకు ఎలా సంభవిస్తాయి? వాటిని ఎలా అదుపు చేయాలో వివరించారు. వివిధ రకాల అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో కార్మికులకు నేర్పించారు. ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ జె.రఘు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, సేఫ్టీ అధికారి ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు రూరల్: వంట గ్యాస్ వినియోగంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నిడదవోలు అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగే వస్తువుల వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారానికి కృషి

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- ఇళ్ల నిర్మాణ పురోగతిపై లబ్ధిదారులతో సమీక్ష



కాటకోటేశ్వరంలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలో వైఎస్సార్ జగనన్న లే అవుట్‌ను బుధవారం ఎమ్మెల్యే, హౌసింగ్ అధికారులు పరిశీలించారు. అక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, సూరాపురం గ్రామాలకు చెందిన 143 మంది లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకునేలా లేఅవుట్‌ను మెరక చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా ఇసుక, సిమెంట్, ఐరన్ అందిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఎస్. చంద్రశేఖర్, ఏఈ సీహెచ్ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు కోసూరి అప్పారావు, గుంటుపల్లి రామచంద్రరావు, పోలిరెడ్డి శివరామకృష్ణ, వద్దిరెడ్డి శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామలాదేవికి నేషనల్ ఫెలోషిప్ అవార్డు



శ్యామలాదేవికి అవార్డు అందజేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

దేవరపల్లి: కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమం నిర్వాహకురాలు జి.శ్యామలాదేవికి ప్రతిష్ఠాత్మక సావిత్రీబాయి పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు దక్కింది. ఫిలంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామలాదేవికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనావాసరావు ఈ పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాజాయోనా మాట్లాడుతూ శ్యామలదేవి వృద్ధులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ సెక్రటరీ తిలక్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, ప్రముఖ సామాజికవేత్త మేదర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో దూకిన యువకుడి మృతదేహం లభ్యం



అఖిల్ సూర్య మృతదేహం

నిడదవోలు రూరల్: నిడదవోలు ఆర్వోబీ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువలోకి ఈ నెల 18న దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఎస్సై నాగరాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌కు చెందిన రాళ్లపల్లి శ్రీనివాస్ కుమారుడైన రాళ్లపల్లి అఖిల్ సూర్య (18) వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదివాడు. ఎంసెట్ కోచింగ్ కోసం ఇంటి నుంచి 17వ తేదీ రాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి నిడదవోలు ఆర్వోబీపై బ్యాగుతో పాటు చెప్పులు బ్రిడ్జిపై పెట్టి కాలువలోకి దూకేశాడు. పోలీసులు, గజ ఈతగాళ్లు యువకుడి ఆచూకీ కోసం గాలించగా బసివిరెడ్డిపేట కాలువ రేవులో అఖిల్ సూర్య మృతదేహన్ని గుర్తించారు. కాలేజీకి వెళ్లడం ఇష్టంలేక తన కొడుకు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు పేర్కొన్నారు.

సందడిగా జగనన్నే మా భవిష్యత్తు



చాగల్లులో పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నిడదవోలు మండలం పెండ్యాలలో..

చాగల్లు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చాగల్లులో ఆ పార్టీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగనమోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వర్ధినేడి చినబాబు తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెంలో ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్కూరి దొరయ్య ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు. అలాగే ఎస్. ముప్పవరం ఊనగట్ల గ్రామాల్లో సర్పంచులు ముప్పిడి మహాలక్ష్మడు, సర్పంచ్ మట్టా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. మార్కొండపాడు, చిక్కాల, నందిగంపాడు, దారవరం తదితర గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, తాడిమళ్ల, తాళ్లపాలెం, పెండ్యాల, డి.ముప్పవరం, సూరాపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన గృహ యజమానుల అంగీకారంతో మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను అంటించారు.

కార్యక్రమాల్లో సర్పంచులు కారింకి అన్నవరం, ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు పడాల రంగారావు, కొప్పుల నాగేశ్వరరావు, సంగినీడి సత్యనారాయణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, వద్దిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు తిరుమళ్ల దుర్గారావు, బట్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.